RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 83 శుక్రవారం 26-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00

విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిటి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉ న్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

## ఇక కార్పొరేషన్ లవలసల పర్వం

తిరుపతి, జూలై 25 వైసీపీలో నేతల వలసలు ప్రారంభమయ్యాయి. కొందరు టీడీపీలోకి, మరికొందరు జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కార్పొరేటర్ల స్థాయి నుంచి ఇప్పుడే వలసల పర్వం మొదలయింది. ఇక ఆగేట్లు లేదు. ఎందుకంటే ఇంకా ఐదేళ్లు అధికారంలో లేకుండా ఉండలేని పరిస్థితి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇప్పటి వరకూ వైసీపీ పాలనలోనే ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సహజంగా ఎమ్మెల్యేలు తమ పట్టును నిరూపించుకునేందుకు వలసలను ప్రోత్సహిస్తారు. పార్టీలో చేర్చుకుంటారు. వాళ్లకు కావాల్సింది అధికార పార్టీలో ఉండటం. ఎమ్మెల్యేలకు కావాల్సింది స్థానిక సంస్థల మీద పట్టు పెంచుకోవడం.దీంతో వైసీపీలో నేతలు ఇక మిగలరన్నది వాస్తవం. ఇన్నాళ్లు నా ఎస్టీలు.. నాఎస్సీలు.. నా బీసీలు.. నా మైనారిటీలు అంటూ ఎక్కువ పదవులను జగన్ వారికే కట్టబెట్టారు. ఇప్పుడు ఎక్కువశాతం మంది పార్టీ మారే వాళ్లలో వారే ఉంటున్నారు. ఎమ్మెల్యేలు చేసే ప్రలోభాలను చూసికావచ్చు. ఐదేళ్ల తర్వాత చూసుకుందాంలే అన్న ధీమా కావచ్చు. వరసగా నేతలు కూటమి పార్టీ వైపు చూస్తున్నారు. ప్రతిపక్షంలో ఉంటే తమకు నిధులు అందవు. ఆధిపత్యం కొనసాగించడానికి వీలుండదు. నామినేటెడ్ పనులు కూడా చేసుకునే వీలుండదు. అందుకే అన్నీ దక్కాలంటే జెండా మార్చేయడమే బెటర్ అన్న ఆలోచన అందరిలోనూ బయలుదేరింది.

# జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత లేదు : ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి : హింసా, నేరప్రవృతి గల జగన్ లాంటి వ్యక్తులకు రాజకీయాల్లో అర్హత లేదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మెరుగైన సమాజం రావాలంటే మంచి రాజకీయ వేత్తలు అధికారంలో ఉండాలని వెల్లడించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల నాలుగోరోజున ఆయన అసెంబ్లీ హాల్‌లో శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరాచక , విధ్వంస పాలన కొనసాగిందని, శాంతి భద్రతలు కరువయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా ఐదేండ్ల వైఎస్ జగన్ పాలనలో జరిగిన హత్యలు, అత్యాచారాలు, దాడులు, దోపిడీలు, నేరాలకు సంబంధించిన అంశాలను చంద్రబాబు స్లైడ్‌ల ద్వారా వివరించారు. ప్రజాప్రతినిధులను కూడా ఎవరిని వదలలేదని ఆరోపించారు. జగన్ హయాంలో కేసులకు గురైన వారిని ఎన్నికల్లో గెలిపించి అసెంబ్లీకి పెద్ద సంఖ్యలో పంపించారని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులందరిపైన కేసులు పెట్టి హింసించారని తెలిపారు.కోడెల శివప్రసాద్‌రఘురామకృష్ణంరాజు, పవన్‌కల్యాణ్,అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు తదితరులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం న్యాయవ్యవస్థను కూడా వదల్లేదని ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో ప్రభుత్వమే హింసను ప్రేరేపించిందని అన్నారు. శాంతి భద్రతలు విఫలమయ్యారని వైసీపీ నేతలు ఢిల్లీలో నిరసన తెలుపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలను సక్రమంగా నిర్వర్తించడంపై పూర్తి బాధ్యత తీసుకుంటుందని చంద్రబాబు ప్రకటించారు. కూటమి పాలనలో నేరాలను పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అరికడతామని స్పష్టం చేశారు.

# 2.91లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్..

హైదరాబాద్: తెలంగాణ 2024-25 వార్షిక బడ్జెట్‌ను ( ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రూ.2 లక్షల 91 వేల 159 కోట్లతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రతిపాదించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా ప్రతిపాదించారు. సంక్షేమం, అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది.

మెట్రో వాటర్ వర్క్సకు రూ.3,385 కోట్లు, నూతనంగా ఏర్పాటు చేసిన హైడ్రాకు రూ.200 కోట్లు, జీహెచ్ఎంసీలో మౌలిక వసతులు కల్పనకు రూ.3,065 కోట్లు, హెచ్ఎండీఏలో మౌలిక వసతుల కల్పనకు రూ.500 కోట్లు, వ్యవసాయానికి రూ.72,659 కోట్లు, ఉద్యానవనం రూ.737 కోట్లు, పశుసంవర్ధక శాఖకు

వ్యవసాయానికి 72 వేల కోట్లు



రూ.1,980 కోట్లు కేటాయించారు. ఇక రూ.500 గ్యాస్ సిలిండర్ పథకం కోసం రూ.723 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,418 కోట్లు ప్రతిపాదించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో కేటాయింపులు ఇలా..

మెట్రో వాటర్ వర్క్స- రూ.3,385 కోట్లు

హైడ్రా సంస్థ- రూ.200 కోట్లు

జీహెచ్ఎంసీలో మౌలిక వసతులు కల్పన- రూ.3,065 కోట్లు

హెచ్ఎండీఏలో మౌలిక వసతుల కల్పన- రూ.500 కోట్లు

విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణ- రూ.100 కోట్లు

హైదరాబాద్ నగర అభివృద్ధికి- రూ10 వేల కోట్లు

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు- రూ.1500 కోట్లు

ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు- రూ1525 కోట్లు

పాతబస్తీ మెట్రో విస్తరణకు- రూ.500 కోట్లు

మల్టీ మోడల్ సబర్బన్ రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్- రూ.50 కోట్లు

ఔటర్ రింగ్ రోడ్డుకు- రూ.200 కోట్లు

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు- రూ.500 కోట్లు

కాగా, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ పద్దు రూ. 2.75 లక్షల కోట్లు. పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ఓటాన్ అకౌంట్ కంటే కొంత పెరిగే అవకాశం ఉంది. నాలుగు నెలల కాలానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, జూలై నెలాఖరుతో ఓన్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సమయం ముగియనుంది. దీంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నారు.

## ఇండియా కూటమితో పొత్తు కోసమే ఢిల్లీకి జగన్.. ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన వ్యాఖ్యలు



అమరావతి : వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఢిల్లీలో ధర్నా చేయడాన్ని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ సెటైర్లు వేశారు. ఏపీలో శాంతి భద్రతలు లేవంటూ ఢిల్లీ రోడ్లపై గగ్గోలు పెట్టడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో జగన్‌ను ఎవరూ పట్టించుకోలేదని, జాతీయ మీడియాతో మాట్లాడటం తప్ప ఒక్కడ ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు.ఇండియా కూటమితో పొత్తు కోసమే వైఎస్ జగన్ ఢిల్లీ వెళ్లినట్లు ఉందని మంత్రి పయ్యావుల కేశ్ అన్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ఇండియా కూటమితో పొత్తుపెట్టుకునేందుకు జగన్ వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ అంటూ ఢిల్లీలో హడావుడి చేయడం కాదని.. ప్రస్తుతం ఏపీలో అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నాయని.. శాసనసభకు వచ్చి మాట్లాడాలని సూచించారు.ధర్నా చేయడానికి ఢిల్లీ వెళ్లిన జగన్ అమరావతికి వచ్చాడని.. ఇక అసెంబ్లీ సమావేశాలకు వస్తే బాగుంటుందని పయ్యావుల కేశవ్ సూచించారు. రాజకీయ హత్యలకు సంబంధించి ఢిల్లీ వేదికగా చెప్పిన వివరాలను అసెంబ్లీకి వచ్చి చెప్పాలని అన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.కాగా, ఇవాళ జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జగన్‌పై హోంమంత్రి వంగలపూడి అనిత కూడా సీరియస్ అయ్యారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు రాజకీయ హత్యలు జరిగాయని.. అందులో ముగ్గురు టీడీపీకి చెందినవారే ఉన్నారని వంగలపూడి అనిత స్పష్టం చేశారు. వాటికి సంబంధించిన కేసు నంబర్లతో సహా వెల్లడించామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరిగాయని వైఎస్ జగన్ ఆరోపిస్తున్నారని.. ఆ పేర్లు అడిగితే మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి ఆ 36 మంది పేర్లు చెప్పే దమ్ము జగన్‌కు లేదా అని ప్రశ్నించారు. చనిపోయిన వాళ్ల పేర్లు చెప్పకుండా ఢిల్లీ ఎందుకు వెళ్లారని ఆమె నిలదీశారు.జగన్ ఆరోపిస్తున్నట్లు టీడీపీ దాడుల్లో చనిపోయిన 36 మంది వివరాలతో సభకు రావాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. ఆ వివరాల ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే ఆ వివరాలు తప్పు అని తేలితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. నారా లోకేశ్ రెడ్‌బుక్ గురించి వైసీపీ కార్యకర్తలే పట్టించుకోవడం లేదని.. మరి జగన్‌కు ఎందుకు నిద్ర పట్టడం లేదో అని ఎద్దేవా చేశారు.

## శాంతి భద్రతలపై ప్రత్యేక చర్చను కోరిన పవన్‌కల్యాణ్.. అంగీకరించిన చంద్రబాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక చర్చ పెట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోరారు. ఏపీ అసెంబ్లీ సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ మీద లోతైన చర్చ జరగాలని సూచించారు.



ఇందుకోసం ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.శాంతి భద్రతల పై ప్రభుత్వం తీసుకునే భవిష్యత్ ప్రణాళిక , చట్టం అంటూ భయం వచ్చే విధంగా ఉండాలని పేర్కొన్నారు. చర్చల్లో సభ్యులందరి సూచనలు తీసుకొని 5 కోట్ల మంది ప్రజల భద్రత కలిగించేలా ఉండాలని అన్నారు. భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ శాంతి భద్రతల్లో తలమానికంగా ఉండేలా విస్తృతస్థాయి చర్చ జరిగి విధి, విధానాల రూపకల్పన చేయాలని సూచించారు. సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ వచ్చే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఒకరోజు శాంత భద్రతల అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. నేరాలను అరికట్టేందుకు ప్రజా చైతన్యం ఎంతో అవసరమని అన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టవంతం చేయాల్సిన అవసరముందని అన్నారు.గత వైసీపీ పాలనలో ప్రజాప్రతినిధులను, సామాన్య ప్రజానీకంపై రాజకీయ ప్రేరేపితంగా పెట్టిన కేసులను విచారించి చర్యలను తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా చట్టాన్ని గౌరవించాలని అన్నారు. కూటమి సభ్యులు ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారిపైనా చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేయనని చంద్రబాబు వెల్లడించారు.

## అసెంబ్లీకి వచ్చి వాళ్ల పేర్లు చెప్పే దమ్ముందా? జగన్‌ను హోంమంత్రి అనిత సవాలు



ఏపీలో ఇప్పటికీ టీడీపీ కార్యకర్తలపై దాడులు కొనసాగుతున్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. నిజానికి తమ పార్టీ కార్యకర్తలపైనే దాడులు చేస్తూ ఢిల్లీకి వెళ్లి దీక్షలు చేస్తున్నారని మండి పడ్డారు. ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సమయంలో వంగల పూడి అనిత మాట్లాడారు. వైసీపీ సాను భూతిపరులపై దాడులు జరుగుతున్న విషయం వాస్తవమేనా? అని ప్రశ్న వేసి వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాలేదని ఎద్దేవా చేశారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు రాజకీయ హత్యలు జరిగాయని.. అందులో ముగ్గురు టీడీపీకి చెందినవారే ఉన్నారని వంగలపూడి అనిత స్పష్టం చేశారు. వాటికి సంబంధించిన కేసు నంబర్లతో సహా వెల్లడించామని అన్నా రు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 36 రాజకీయ హత్యలు జరి గాయని వైఎస్ జగన్ ఆరోపిస్తున్నారని.. ఆ పేర్లు అడిగితే మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. అసెంబ్లీకి వచ్చి ఆ 36 మంది పేర్లు చెప్పే దమ్ము జగన్‌కు లేదా అని ప్రశ్నించారు. చనిపోయిన వాళ్ల పేర్లు చెప్పకుండా ఢిల్లీ ఎందుకు వెళ్లారని ఆమె నిలదీశారు.జగన్ ఆరోపి స్తున్నట్లు టీడీపీ దాడుల్లో చనిపోయిన 36 మంది వివరాలతో సభకు రావాలని హోంమంత్రి వంగలపూడి అనిత డిమాండ్ చేశారు. ఆ వివరాల ఆధారంగా చర్యలు తీసుకుంటావని హామీ ఇచ్చారు. అయితే ఆ వివ రాలు తప్పు అని తేలితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. నారా లోకేశ్ రెడ్‌బుక్ గురించి వైసీపీ కార్యకర్తలే పట్టించుకోవడం లేదని.. మరి జగన్‌కు ఎందుకు నిద్ర పట్టడం లేదో అని ఎద్దేవా చేశారు.

## నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిన కర్ణాటక అసెంబ్లీ

నీట్ పరీక్ష కు వ్యతిరేకంగా కర్ణాటక అసెంబ్లీ తీర్మానం చేసింది. కర్ణాటక మెడికల్ ఎడ్యుకేషన్ ఙ స్కిల్ డెవలప్ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానంపై చర్చ అనంతరం అసెంబ్లీ ఆమోదం తెలిపింది. నీట్‌కు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని కొన్ని రోజుల క్రితమే కర్ణాటక క్యాబినెట్ నిర్ణయించింది.కర్ణాటక క్యాబినెట్



నీట్ రద్దుపై నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే పశ్చిమబెంగాల్ అసెంబ్లీ నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. ఈ నెల 23న నీట్ రద్దును కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానం బెంగాల్ అసెంబ్లీ ఆమోదించింది. ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో అవకతవకలు బయటపడటంతో నీట్ నిర్వహణపై అనుమానాలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నీట్‌ను రద్దు చేసి, దాని స్థానంలో కొత్త విధానం తీసుకురావాలని ప్రతిపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబుకు వైఎస్ షర్మిల లేఖ

అమరావతి : ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి గురువారం లేఖ రాశారు. రాష్ట్రాన్ని ఇటీవల కుదుపేసిన వర్షాల వల్ల తీవ్ర పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు.వర్షం వల్ల కోస్తా జిల్లాలో భారీగా పంట నష్టం



జరిగిందని వెల్లడించారు. పంట కాలువలు మరమ్మతులకు నోచుకోకపోవడం వల్ల వర్షం నీరు పంట పొలాల్లో చేరి తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. భారీ వర్షాలకు జరిగిన నష్టంపై క్యాబినెట్ మంత్రులు, ఎంపీలు, స్థానిక ఎమ్మెల్యేలు విా దృష్టికి తీసుకురాలేపోవడం విచారకరమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన స్పందించి రాష్ట్రంలో జరిగిన పంట నష్టంపై అధికారులను క్షేత్రస్థాయికి పంపి నివేదికలను తెప్పించుకోవాలని సూచించారు.అదేవిధంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి తగిన నష్ట పరిహారాన్ని రైతులకు అందించాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం కాలువల మరమ్మతులకు కేటాయించిన నిధులను దారి మళ్లించడంతో కాలువల మరమ్మతులను , పూడిక మట్టిని తొలగించడంలో ఘోరం విఫలమైందని ఆరోపించారు. మిగిలిన నిధులను కేటాయించి జిల్లా అధికారులచేత కాలువల మరమ్మతు పనులను పూర్తి చేయించాలని కోరారు.

## బ్రిటన్‌తో బంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం.. ప్రధాని నరేంద్ర మోదీ

ఢిల్లీ,బ్రిటన్‌తో బంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం.బ్రిటన్‌తో ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఎఫ్‌టీఏ,ఖరారు చేసుకోవాలనే బ్రిటన్ ఆకాంక్షను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ బుధవారం ప్రధాని మోదీని కలిశారు.

# సంపాదకీయం

శుక్రవారం 26-07-2024

## భయపెడుతున్న నిరుద్యోగం.....

పంచంలో ఏ మూలకు వెళ్లిన భారతీయులు కనిపిస్తారు. అక్కడ ఏదో ఒక వృత్తి, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. కానీ, సొంత దేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. దేశ యువత విద్య పరంగా మంచి మార్కులు, గ్రేడ్లు సంపాదిస్తున్నప్పటికీ.. జీవనోపాధి అవకాశాలు అందిపుచ్చుకోడంలో ఫెయిల్ అవుతున్నారు. ఇలా, నైపుణ్యాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొరవడితే.. యువతలో అసహనం పెరిగిపోతుంది. అది, చివరికి దేశంలో తిరుగుబాటుకు కూడా దారి తీసే అవకాశాలు కూడా లేకపోలేదు. కొన్ని దేశాలు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కున్న సందర్భాలున్నాయి. నిరుద్యోగం పెరిగి, ప్రభుత్వాలు వారికి పెన్షన్ వంటి పథకాలు ప్రవేశపెట్టి.. ఆనక ఆర్థిక సంక్షోభం ఏర్పడి, అల్లకల్లోలం అయిన దేశాలూ ఉన్నాయి. ఇక, ఈ పరిస్థితి కంటే ముందు, దేశాభివృద్ధికి తోడ్పడాల్సిన యువత మానసిక ఆరోగ్యంపై, నిరుద్యోగం తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. అందుకే, ఈ గ్యాప్స్ ఎంత త్వరగా పూడ్చడానికి చర్యలు తీసుకుంటే, అంత త్వరగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేర్చడం సాధ్యం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.భారతదేశంలో నిరుద్యోగ సమస్యపై అంతర్జాతీయ కార్మిక సంస్థ, మానవాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ఇటీవల ఓ అధ్యయనం చేపట్టాయి. 'భారత ఉపాధి నివేదిక-2024' పేరిట ఆ ఫలితాలను వెల్లడించాయి. దేశంలో పనిచేసే వయసులో ఉన్నవారి సంఖ్య 2011లో 61శాతం కాగా.. 2021నాటికి అది 65 శాతానికి పెరిగిందని ఈ నివేదిక తెలిపింది. ఇక, ఏటా 78 లక్షల మంది శ్రామిక శక్తిలో భాగస్తులు అవుతున్నా.. నిరుద్యోగులుగా మిగిలిపోతున్నవారిలో 83 శాతం యువతే ఉంటోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఇక, దేశంలో ఎక్కువ ఉద్యోగాలు అసంఘటిత రంగంలోనే లభిస్తున్నాయనీ.. చాలా మంది చిరు వ్యాపారాలతో స్వయం ఉపాధి పొందుతున్నవారు, చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్నవారేనని నివేదిక తెలిపింది. ఇక, గిగ్ వర్కర్లు వంటివారు దీని పరిధిలోకే వస్తారు. అయితే, గతేడాది, 90 శాతం పైచిలుకు ఉద్యోగాలు అసంఘటిత రంగంలోనే లభించాయనీ.. కానీ, ఈ రంగంలో పనిచేసే వారికి కనీస వేతనాలు దక్కట్లేదు.. జీవనోపాధికైనా భద్రత ఉండట్లేదని అధ్యయనం వెల్లడించింది.దేశంలో మొత్తం ఉద్యోగితలో సంఘటిత రంగం వాటా తొమ్మిది శాతమే. అందులో 42శాతం ఉద్యోగాలు అసంఘటిత రంగ స్వభావాన్ని కలిగినవే ఉంటున్నాయి. ఆర్థిక సంస్కరణల మూలంగా ఒప్పంద ఉద్యోగ వ్యవస్థ విస్తరిస్తుండటంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఇక, అందుబాటులోకి వస్తున్న ప్రతి వంద ఉద్యోగాల్లో కేవలం రెండు మాత్రమే ప్రభుత్వ రంగంలో ఉంటున్నాయని ఉపాధి నివేదిక విశ్లేషించింది. ఎన్నికల వేళ ఉద్యోగాల భర్తీకి హామీలు గుప్పిస్తున్న పార్టీలు తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నెరవేర్చడంలేదు. దాంతో అనేకమంది విద్యావంతులు నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నారని నివేదిక పేర్కొంది. కాబట్టి, సంఘటిత రంగంలో పెద్దయెత్తున ఉద్యోగాలను భర్తీచేయాల్సిన అవసరాన్ని నివేదిక గుర్తుచేసింది.ఇక, దేశంలో ఉపాధి అవకాశాలు కొరవడటానికి ప్రధాన కారణం.. నాణ్యతలేని చదువులేనని ఎప్పటి నుండో నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2022 నాటికి దేశ యువతలో 15.62 శాతం వివిధ వృత్తివిద్యలను అభ్యసించారు. కానీ, వారిలో సుమారు 4 శాతమే సంబంధిత వృత్తుల్లో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను సాధించారు. దాంతో ఉద్యోగాలు లభించక చాలామంది ఏదో ఒక పని చేసుకుంటూ ఉన్నారు. దీని వల్ల, దేశంలో తయారీ రంగం కల్పించే ఉపాధి వాటా 12.14 శాతం దగ్గరే నిలిచిపోయింది. ఇప్పుడిక, దీన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని నివేదికలు నొక్కి చెప్పాయి. పెద్దసంఖ్యలో యువత ఉన్నత విద్యను పూర్తి చేస్తున్నప్పటికీ, ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలు వారిలో కొరవడుతున్నాయనీ.. 75 శాతం యువత సరిగ్గా ఈ-మెయిల్ పంపలేకపోతున్నారని, 60 శాతం కంప్యూటర్లలో ఫైళ్లను కాపీ, పేస్ట్ చేయలేకపోతున్నారంటూ వాస్తవ పరిస్థితిని ఉపాధి నివేదిక వివరించింది. నైపుణ్యం అవసరమైన ఉద్యోగాలకు అసలు అభ్యర్థులే దొరకడంలేదని పరిశ్రమలు చెబుతున్నాయి.దేశంలో యువతకు ఉత్పత్తి రంగంలో ఎక్కువ అవకాశాలను కల్పించాల్సిన అవసరాన్ని నివేదికలు గుర్తుచేస్తున్నాయి. దీని కోసం, విద్యా వ్యవస్థలో ఒకేషనల్ శిక్షణను అభివృద్ధి పరచాలి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవాలి. ఆధునిక కాలంలో ముఖ్యంగా ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, జీ-పాట్ వంటి నూతన చదువులు, విధానాలు అన్నింటా ఆధిపత్యం వహిస్తున్న ప్రస్తుత తరుణంలో భారతదేశ విద్యా విధానంలో సాంకేతిక పరిజ్ఞానానికి, నైపుణ్యాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలి. సైంటిఫిక్ టెంపర్‌ను ప్రోత్సహించే చదువులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. కొత్త కొత్త చదువులు, రంగాల్లో యువతను ప్రోత్సహించాలి. 2022 ఇండియా స్కిల్ రిపోర్ట్ నివేదిక ప్రకారం మనదేశంలో 52.8 శాతం మహిళలు నూతన రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటే.. పురుషులు కేవలం 47.2 శాతం మాత్రమే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందినట్లు తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే.. గతంలో, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకటించిన నివేదిక ప్రకారం.. 2030 నాటికి భారత్‌లో సుమారు 29 మిలియన్ల యువత నైపుణ్యలేమితో ఇబ్బంది పడే పరిస్థితులు వస్తాయి.అభివృద్ధి చెందిన సింగపూర్, సౌత్ కొరియా వంటి దేశాలు తమ దేశాల యువతకు భవిష్యత్ అవసరాలను తీర్చేలా నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్నాయి. తద్వారా ప్రపంచ మార్కెట్లను అందిపుచ్చుకుని, అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. అదే విధంగా, ఫిన్లాండ్ దేశం కూడా ఆ దేశ యువతకు వివిధ పరిశ్రమలకు అవసరమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఉన్న చదువును, నైపుణ్యాలను అందిస్తుంది. ప్రపంచ మార్కెట్లో నిలబడే విధంగా తర్ఫీదు ఇస్తుంది. ఇలాంటి దేశాల్లా భారత్ కూడా దేశ యువతకు పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక నైపుణ్యాలను అలవర్చే దిశగా చదువుల్లో మార్పు తీసుకురావాలి.అలాగే.. దేశంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు అంతర్జాతీయ కార్మిక సంస్థ వంటివి పలు సిఫారసులు కూడా చేశాయి. ప్రభుత్వాలు అభివృద్ధితో కూడిన ఉపాధి కల్పన భావనను విస్మరించడం తగదని, దేశానికి ఉపాధి కేంద్రీకృత అభివృద్ధి చాలా అవసరమని సూచించాయి. కాబట్టి, ఆ దిశగా ఉత్పత్తి రంగాన్ని పరిగెత్తించాలి. ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పించే చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పెద్దయెత్తున పెట్టుబడులను సమకూర్చడం కూడా ఎంతో ముఖ్యం. అలాగే, దేశంలో పట్టణీకరణ శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో.. ఉద్యోగావకాశాలు పట్టణ ప్రాంతాల్లోనే అధికంగా ఉంటాయి.

# కొత్త టర్న్ తీసుకోబోతున్న జగన్ రాజకీయం

**ఇండియాకూటమిలో చేరిక దిశగా అడుగులు**
**అనివార్యంగా కాంగ్రెస్ వెంట నడవక తప్పనిస్థితి**
**ఢిల్లీ ధర్నాతో ఇండియా కూటమికి మరింత చేరువ**

అమరావతి,జూలై25: వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో చేపట్టిన ధర్నా రాజకీయంగా కొత్త టర్న్ తీసుకుంటుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ కూటమికి జగన్ దగ్గరవుతున్నారనడానికి ఢిల్లీ ధర్నా రుజువు చేయబోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితిఉల్లో బిజెపి లేదా కాంగ్రెస్ కూటామిల్లో ఏదో ఒకదాంట్లో ఉండని పరిస్థితి ఏర్పడింది. బిజెపి కూటమిలో చంద్రబాబు చేరారు కనుక జగన్ కాంగ్రెస్ కూటమిలో అనివార్యంగా చేరాల్సిందే. రాజకీయంగా మనుగడ సాగించాలంటే ఇది తప్పదు. ధర్నాకు ఇండీ కూటమి నేతలంతా ఏకపక్షంగా మద్దతు పలికారు. షర్మిల ఫీల్ అవుతుందనో మరో కారణమో కానీ కాంగ్రెస్ నుంచి మాత్రం ఎవరూ రాలేదు. కానీ కూటమి నుంచి నేతలంతా వచ్చారంటే.. వ్యూహాత్మకమేనని అనుకోవచ్చు. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు మరో దారి లేదు. ఆయన ఖచ్చితంగా ఇండీ కూటమి దారిలో వెళ్లాలి. బీజేపీకి మద్దతుగా ఇక ఎంత మాత్రం ఉండే అవకాశం లేదు. ఎందుకంటే .. కష్టాల్లో ఇంతగా మద్దతుగా ఉన్న ఇండీ కూటమిని కాదని బీజేపీ దగ్గరకు వస్తే అటు బీజేపీ అనుమానిస్తుంది.. ఇటు కాంగ్రెస్ కూటమి ఆగ్రహిస్తుంది. అందుకే జగన్ అన్నీ ఆలోచించుకునే ఇండీ కూటమి నేతల్ని ధర్నాకు మద్దతుగా ఉండాలని ఆహ్వానించినట్లుగా భావిస్తున్నారు. ఇండియా కూటమిలో చేరాలని జగన్మోహన్ రెడ్డిని సంఘిభావం తెలియచేయడానికి వచ్చిన పార్టీల నేతలంతా ఆహ్వానించారు. దీనిపై జగన్ స్పందన ఏమిటన్నదానిపై స్పష్టత లేదు కానీ ఆయన గతంలోలా బీజేపీకి మద్దతు పలికే అవకాశం లేదు. 2014 నుంచి జగన్ బీజేపీకి మద్దతుగానే ఉన్నారు. 2014లో ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉన్నప్పటికీ ఆయన పరోక్షంగా బీజేపీతో సంబంధాలు కొనసాగించారు. ఈ కారణంగా బీజేపీ, టీడీపీ మధ్య అభిప్రాయభేదాలు వచ్చి .. చంద్రబాబు కూటమి నుంచి బయటకు వచ్చారు. చంద్రబాబు బీజేపీకి పరోక్షంగా పూర్తి స్థాయిలో మద్దతుగా ఉండగలరు కానీ బీజేపీతో పొత్తులు పెట్టుకోలేరు. ఎందుకంటే ఆయన ఓటు బ్యాంక్ పూర్తిగా దళిత, ముస్లింలు, బీజేపీతో పరోక్షంగా స్నేహాన్ని మరో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల వారు సమర్థించి ఓట్లు వేసి ఉండవచ్చు కానీ నేరుగా పొత్తులు పెట్టుకుంటే మాత్రం ఓటు వేయరు. అందుకే నేరుగా ఎన్డీఏ కూటమిలో చేరేందుకు ఆయన వెనుకాడారు. ఇప్పుడు ఇండీ కూటమికి దగ్గరవుతుతున్నారు. ఇండీ కూటమి ఆయనకు ఓటు బ్యాంక్ పరంగా సేఫ్. కానీ బీజేపీని కాదంటే జరగబోయే పరిణామాల్ని ఎదుర్కోవడం కష్టమని ఇంత కాలం ఆయన ఆ పార్టీ పట్ల భయభక్తులతో ఉన్నారని అనుకోవచ్చు. కానీ ఢిల్లీ ధర్నా తర్వాత ఆయన అనివార్యంగా ఇండియా కూటమితో నడవక తప్పదు. కేంద్ర ప్రభుత్వానికి అంశాల వారీగా మద్దతిస్తామని గతంలో జగన్ ప్రకటించారు. అయితే ఇక ముందు ఎలాంటి అంశమైనా వైసీపీ తరపున ఆయన వ్యతిరేకించాల్సిందే. లేకపోతే బీజేపీతో సంబంధాలు కొనసాగుతున్నాయని ఇండి కూటమి నేతలు అనుకుంటారు. కేంద్రంలో బీజేపీపై పోరాటంలో ఇండీ కూటమికి జగన్ మద్దతు ప్రకటించకపోతే.. ఆయనకు ఇక ఏ విషయంలోనూ ఆ వైపు నుంచి సపోర్టు రాదు. ఇప్పుడు మద్దతు ప్రకటించినందుకు వారు చింతించే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి వైపు నుంచి ఆయన ఎలాగూ సపోర్టు రాదు. కూటమిలో టీడీపీ, జనసేన ఉంటాయి. అయితే బీజేపీతో ఆయన పరోక్ష సంబంధాలను కొనసాగించవచ్చు. కానీ దాని వల్ల ఆయనకు ఎంత లాభం జరుగుతుందో అంచనా వేయడం కష్టమే. అంటే.. ఢిల్లీ ధర్నాలో తనకు సంఘిభావం తెలిపిన ఇండీ కూటమిని కాదని.. ఆయన బీజేపీకే మద్దతుగా ఉంటానని వెళ్తే.. రెంటికి చెడ్డ రేవడి అవుతారు. ఢిల్లీలో ధర్నా చేయాలని జాతీయ పార్టీల మద్దతు కోరాలని జగన్ ఎందుకు అనుకున్నారో కానీ.. ఇప్పుడు ఆయన ఇరుక్కుపోయారని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఏపీలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వం. ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇండీ కూటమి నేతల్ని పిలిచి ధర్నా చేశారు. కాబట్టి ఆయనను బీజేపీ ఎంత మాత్రం ఇక ఆదరించదు. పైగా .. చంద్రబాబు ప్రభుత్వంపై .. జాతీయ స్థాయి నేతల్ని పిలిచి చెప్పాల్సిన అవసరం లేదు. రాష్ట్ర స్థాయిలో పోరాడవచ్చు. కానీ జగన్ ఢిల్లీ ధర్నా ఎ÷-లాన్ చేసుకున్నారు. ఇప్పుడు ఖచ్చితంగా ఆయన ఓ స్టాండ్ తీసుకోవాల్సిన సమయం వచ్చింది. ఎన్నికలు ముగిసి రెండు నెలలే కాబట్టి.. దాదాపుగా ఇంకా నాలుగున్నరేళ్లకుపైగానే ఆయన బీజేపీ కి వ్యతిరేకంగా పోరాడాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆయన వెనక్కి తగ్గలేరు.

# వైసీపీలో మండలి చిచ్చు

విజయవాడ, జూలై 25 వైసీపీలో అంతర్గత పోరు మొదలైంది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని జగన్ ఢిల్లీ వేదికగా గళం ఎత్తారు. జాతీయ పార్టీల మద్దతు కూడగట్టారు. జంతర్ మంతర్ వద్ద జగన్ చేపట్టిన దీక్షకు సమాజ్ వాది పార్టీతో పాటు ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోనే శివసేన పార్టీ మద్దతు ప్రకటించింది. అఖిలేష్ యాదవ్ సంఘీభావం తెలిపారు. శివసేన తరుపున ఎంపీ హాజరయ్యారు. ఏపీలో నరమేధం కొనసాగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఒకవైపు జాతీయ స్థాయిలో జగన్ ఇతరుల మద్దతు పొందుతుండగా.. ఏపీలో వైసీపీ నుంచి నేతల నిష్క్రమణ ప్రారంభమైంది. అది కూడా కీలకమైన గుంటూరు జిల్లా నుంచి. నిన్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి వైసిపికి గుడ్ బై చెప్పారు. 2019 ఎన్నికల్లో టిడిపి నుంచి గెలిచారు ఆయన. కొద్ది రోజులకే వైసీపీలోకి ఫిరాయించారు. కానీ ఎన్నికల్లో మద్దాలి గిరికి జగన్ టికెట్ ఇవ్వలేదు. విడదల రజినీకి టికెట్ కేటాయించారు. మద్దాలి గిరి సహకరించారు. అయినా సరే వైసీపీలో ఆయనకు సరైన గుర్తింపు లభించలేదు. ఇక ఆ పార్టీలో ఉండడం వేస్ట్ అని నిర్ధారించుకున్న గిరి.. వైసీపీకి రాజీనామా చేశారు. తిరిగి టిడిపిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు గుంటూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేసిన కిలారి రోశయ్య తాజాగా వైసీపీకి రాజీనామా ప్రకటించారు. పొన్నూరు ఎమ్మెల్యే గా ఉన్న ఆయనను.. అయిష్టంగానే గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయించారు. ఓటమి చెందడంతో అసంతృప్తితో ఉన్న రోశయ్యపార్టీకి గుడ్ బై చెప్పారు. ఈయన వైసీపీ సీనియర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లకు స్వయానా అల్లుడు. శాసనమండలి వైసిపి పక్ష నేతగా లేళ్ళ అప్పిరెడ్డి నియామకం తర్వాతనే కిలారి రోశయ్య పార్టీకి గుడ్ బై చెప్పడం విశేషం.ఒక వ్యూహం ప్రకారం వైసీపీ నేతలు పార్టీ నుంచి బయటకు వస్తున్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు అంతా హాజరు కావాలని స్వయంగా జగన్ పిలుపునిచ్చారు. కానీ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు ఆదేశాలను బేఖాతరు చేశారు. శాసనమండలి సమావేశాల్లో కనిపించారు. దీంతో వారు వేరే ఆలోచనతో ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే గుంటూరు పార్లమెంట్ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య వైసీపీకి రాజీనామా చేయడం విశేషం. కేవలం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గౌరవించలేదని ఆయన ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కనీసం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేరును వైసీపీ శాసనమండలి పక్ష నేతగా కూడా పరిగణలోకి తీసుకోకపోవడాన్ని రోశయ్య తప్పుపట్టారు. శాసనమండలి చైర్మన్ పదవిని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆశించారు. అప్పట్లో సమీకరణల పేరుతో మోసేన్ రాజుకు పదవి ఇచ్చారు జగన్. ఇప్పుడు శాసనమండలిలో సీనియర్ సభ్యుడుగా ఉన్న ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లను పక్కనపెట్టి.. అదే జిల్లాకు చెందిన లేళ్ల అప్పిరెడ్డిని శాసనమండలి వైసిపి పక్ష నేతగా ఎంపిక చేయడంతో రోశయ్య పార్టీకి గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు టిడిపిలో సీనియర్. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా కూడా కొనసాగారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన చాలా పదవులు అనుభవించారు. కానీ వైసీపీ ఆవిర్భావంతో జగన్ వెంట అడుగులు వేశారు. వైసీపీ ఏర్పాటు సమయంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు యాక్టివ్ గా పని చేశారు. 2014 ఎన్నికల్లో విశేష సేవలు అందించారు. 2019 ఎన్నికలకు ముందు నవరత్నాలు, ఎన్నికల హామీల రూపకల్పనలోఉమ్మారెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు. కానీ ఆయన సేవలను కేవలం ఎమ్మెల్సీ గానే వాడుకున్నారు జగన్. పెద్దగా గుర్తింపు లభించలేదు. మంత్రి పదవి ఆశించినా దక్కలేదు. కనీసం రాజ్యసభకు కూడా నామినేట్ చేయలేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. మంత్రి పదవి పై ఉమ్మారెడ్డి ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయనను కాదని అంబటి రాంబాబు, విడదల రజిని, పేర్ని నాని వంటి వారికే అవకాశం ఇచ్చారు. కనీసం ఉమ్మారెడ్డి పేరును కూడా పరిగణలోకి తీసుకోలేదు. ఈ ఎన్నికల్లో గుంటూరు పార్లమెంట్ స్థానం అభ్యర్థిగా తొలుత ఉమ్మారెడ్డి కుమారుడు వెంకటరమణ పేరు ప్రకటించారు. అయితే ఉమ్మారెడ్డి మాత్రం గుంటూరు పశ్చిమ సీటును ఆశించారు. ఆ సీటును టిడిపి నుంచి వచ్చిన మద్దాలి గిరిని కాదని విడదల రజినీకి అప్పగించారు జగన్. ఉమ్మారెడ్డి అల్లుడు కిలారి రోశయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నూరు నియోజకవర్గ టికెట్ ను అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణ కేటాయించారు. అయిష్టంగానే రోశయ్య కు గుంటూరు పార్లమెంట్ టిక్కెట్టు కట్టబెట్టారు. పొన్నూరు అసెంబ్లీ స్థానం కేటాయించాలని రోశయ్య ఎన్నికలకు ముందు ఒకసారి కోరారు. అయినా సరే జగన్ ఒప్పుకోలేదు. గత ఐదేళ్లుగా ఎటువంటి గుర్తింపు ఇవ్వకపోగా.. ఉమ్మారెడ్డి సీనియారిటీని సైతం తాజాగా శాసనమండలి వైసిపి పక్ష నేతగా పరిగణలోకి తీసుకుపోవ డాన్ని ఆ కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. అందుకే ముందుగా రోశయ్య పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో ఉమ్మారెడ్డి కుటుంబం సైతం వైసీపీకి గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నట్లు సమాచారం. అదే జరిగితే వైసిపికి కోలుకో లేని దెబ్బ. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉమ్మారెడ్డి కుటుంబం జనసేనలో చేరుతుందని ప్రచారం జరుగుతోంది. అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# అమరావతికి నిధుల వరద



విజయవాడ, జూలై 25 సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019 జూలై నెలలో ప్రపంచ స్థాయి ఆర్థిక సంస్థలు ఆంధ్రప్రదేశ్ నుంచి పెట్టుబడుల్ని ఉపసంహరించు కున్నాయి. 2019లో ఏపీ అధికారంలోకి వచ్చిన వైఎస్సార్సీపీ ప్రభుత్వ ప్రాధాన్యతలు, కేంద్రం ఆలోచనలు నేపథ్యంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి.2014-18 మధ్య ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ భాగస్వామిగా ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అమరావతి నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. 2018లో జరిగిన నాటకీయ పరిణామలు, ఏపీకి ప్రత్యేక హోదా డిమాండ్ నేపథ్యంలో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటకు వచ్చేసింది. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడంతో ఏపీ ప్రభుత్వ ప్రాధాన్యతలు కూడా మారిపోయాయి.వైసీపీ అధికారంలోకి వచ్చిన నెలన్నరలోపే ఏపీ రాజధానికి ఆర్థిక సాయం అందించే ప్రాజక్టు నుంచి ప్రపంచబ్యాంకు వైదొలగింది. సరిగ్గా ఐదేళ్ల క్రితం 2019 జూలై 21న కేంద్రప్రభుత్వం సిఫార్సును ఉపసంహరించు కోవడంతో అమరావతి ప్రాజెక్టుకు ఆర్థికసాయం అందించడాన్ని ప్రపంచ బ్యాంకు నిలిపివేసింది.అమరావతి నిర్మాణ ప్రాజెక్టుకు 300 మిలియన్ డాలర్ల రుణం ఇవ్వాలనే ప్రతిపాదనను ప్రపంచ బ్యాంకు విరమించుకున్నట్లు 2019లో జూలైలో మూడో వారంలో ప్రకటించింది. ఆ నిర్ణయం వెలువడిన రెండు రోజుల తర్వాత, అమరావతి ప్రాజెక్టును విరమించుకోవడానికి గల కారణాలను ప్రపంచ బ్యాంక్ వెల్లడించింది.2019 జులై 18న ప్రపంచ బ్యాంకు వెబ్‌సైట్‌లో ఎలాంటి కారణాలు చూపకుండానే అమరావతి ప్రాజెక్ట్‌ను 'డ్రాప్' చేసినట్లు పేర్కొంది. "అమరావతి సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్" మొత్తం ప్రాజెక్ట్ వ్యయం 715 మిలియన్ డాలర్లలో, 300 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయంగా అందించడానికి ముందుకు ప్రపంచ బ్యాంకు ముందుకు వచ్చింది. మిగిలిన మొత్తాన్ని ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా ఇచ్చేందుకు అంగీకరించింది.వైసీపీ అధికారంలోకి రాగానే "ప్రతిపాదిత అమరావతి సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌కి ఫైనాన్సింగ్ కోసం ప్రపంచ బ్యాంకుకు చేసిన అభ్యర్థనను 2019 జూలై 15న భారత ప్రభుత్వం ఉపసంహ రించుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రతిపాదిత ప్రాజెక్ట్ మనుగడలో ఉండదని ప్రపంచ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల బోర్డుకు సమాచారం అందినట్టు" అని ప్రపంచ బ్యాంకు ప్రకటనలో పేర్కొంది.అదే సమయంలో ఆరోగ్యం, వ్యవసాయం, ఇంధనం మరియు విపత్తు నిర్వహణ రంగాలను కవర్ చేసే 1 బిలియన్ డాలర్ల ప్రోగ్రామ్‌తో ప్రపంచ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మద్దతునిస్తున్నట్టు అప్పట్లో ప్రపంచబ్యాంకు ప్రకటన పేర్కొంది. 2019 జూన్ 27న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ఆరోగ్య రంగం కోసం 328 మిలియన్ డాలర్ల సాయం కోసం ప్రపంచబ్యాంకుతో ఒప్పందం చేసుకుంది.ప్రపంచ బ్యాంకు అమరావతి ప్రాజెక్టు నుంచి వైదొలగినట్టు ప్రకటించిన రెండ్రోజులకే ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ కూడా అమరావతి ప్రాజెక్టు నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. చైనా ప్రధాన కార్యాలయంగా ఉన్న ంఎఎః ఏపీ కొత్త రాజధాని నగర నిర్మాణ ప్రాజెక్ట్-అమరావతికి ఆర్థిక సహాయం నుండి వైదొలిగిన ఐదేళ్లకు అదే రోజు పార్లమెంటులో రూ.15వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ఏజెన్సీల నుంచి అందించనున్నట్టు ఆర్థిక మంత్రి ప్రకటించారు.అమరావతిలో ఐదు భాగాలలో కీలకమైన మౌలిక సదుపాయాలు మరియు సౌకర్యాలను నిర్మించడానికి ప్రపంచబ్యాంకుతో పాటు ంఎఎః సంయుక్తంగా 715 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణాన్ని అందించాలని నిర్ణయించాయి.ఇందులో ప్రపంచ బ్యాంకు 300 మిలియన్ జూఆలను ఆర్థికంగా అందించాల్సి ఉండగా, ంఎఎః 200 మిలియన్ డాలర్లను రుణంగా ఇవ్వాల్సి ఉంది. 'అమరావతి సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్' మొత్తం వ్యయంలో ఈ రుణం 28 శాతంగా ఉంది.అమరావతి క్యాపిటల్ సిటీ మాస్టర్ ప్లాన్ కింద రోడ్ నెట్‌వర్క్‌లో భాగంగా 92.2 కి.మీ హై స్పీడ కారిడార్ నిర్మాణానికి ఈ నిధులు సమకూర్చుకోవాలని భావించారు.

# భారతదేశ మిస్సైల్ మ్యాన్ భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం

**-నేడు ఆయన వర్ధంతి**



భారతదేశ మిస్సైల్ మ్యాన్ మన భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం..భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఆయన ఒకరు. ఈయన పూర్తి పేరు.. డాక్టర్ అబుల్ ఫకీర్ జైనుల్లాబ్దీన్ అబ్దుల్ కలామ్. ఈయన 1931, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు అషియమ్మ జైనుల్లాబ్దీన్, జైనుల్లాబ్దీన్ మరకయార్. ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన 1958లో మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ ఎం) నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. పట్టభద్రుడైన తర్వాత ఆయన భారతదేశపు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ)లో ఒక విఫలమైన హోవర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు మీద పనిచేయడానికి చేరారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరారు. అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారతదేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎల్వి-ఎఎఎ)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వీ క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-ఎఎ అణుపరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడంజరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్రరాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈయనకు భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మ భూషణ్ (1981), పద్మ విభూషణ్ (1990), భారతరత్న (1997)లు వరించాయి. అలాగే, దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 30వరకు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగుపెట్టారు. ఈయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాంపై వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా 87-ఏళ్ళ లక్ష్మీ సెహగల్ పోటీ చేశారు. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. "ప్రజలు.. తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టడం కోసమే అవినీతిపరులౌతారు" అంటూ ఆయన బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. కానీ, కలాం ఖురాన్‌తో పాటు, భగవద్గీతను కూడా చదువుతారు. మతఘర్షణలను నిరసించే శాంతికాముకుడిగా పేరుగడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం సాయంత్రం హఠాన్మరణానికి గురయ్యారు. షిల్లాంగ్‌లోని ఐఐఎంలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 45 నిమిషాల వ్యవధిలోనే కలాం కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

# వర్షాలతో సీజనల్ వ్యాధుల భయం

## జిల్లాల్లో మలేరియా,డెంగ్యూల ప్రభావం

## అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరిక

కాకినాడ,జూలై25(ఆర్ఎన్ఎ): యేటా వానా కాలంలో వ్యాధుల ముప్పు పెరిగి పేదల జీవితాలు దుర్భరమవుతున్నాయి. మలేరియా, డెంగ్యూ, చికున్‌గు న్యా, మెదడువాపు, ఫైలేరియా, అతిసారం, టైఫాయిడ్, తదితర సీజనల్ వ్యాధులు గ్రామీణులను తీవ్రంగా వేధిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ ఏటా హెచ్చరిస్తూనే ఉంది. ఇందుకు సంబంధించి ఇటీవల అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులతో పాటు, నియంత్రణ చర్యలను కూడా ఏకకాలంలో కొనసాగించాలని వైద్య ఆరోగ్యశాఖల అధికారులకు సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో నీటిసంబధిత, కీటక సంబంధిత వ్యాధులు ప్రబలుతున్నందున్న జాగ్రత్తగా ఉండాలనిఆయా శాఖలను ఆదేశించారు. ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న సామాజిక, బౌగోళిక వైరుధ్యాల కారణంగా యేటా వానాకాలంలో అంటు వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు కూడా ప్రబలడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. మలేరియా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో..ఈ నేపథ్యంలోనియంత్రణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మలేరియా, డెంగ్యూ జ్వరాలతో బాదితులు మరణించినట్లు అధికారికంగా రికార్డు కాకపోయినా ఏజెన్సీలో ఎలాంటి డయాగ్నసిస్ చేయని కేసులే అధికంగా ఉన్నాయంటున్నారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించామని చెబుతున్నా మారుమూల గ్రామాల్లో రహదారులు సరిగ్గా లేని కారణంగా సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి శాంపిల్స్‌ను సేకరించే పరిస్థితులు అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో చాలా మంది జ్వరాల బారిన పడిన రోగులు అందుబాలులో ఉండే ఆర్ఎంపీలు, సాంప్రదాయ నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తూ ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీలో మలేరియా వంటి వ్యాధుల నియంత్రణ కోసం ఆదివాసీ గ్రామాల్లో వేల దోమ తెరలను పంపిణీ చేశారు. మారుమూల అటవీ గ్రామాల్లో ప్రతి సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఉత్పన్నమవుతోంది. అత్యంత సమస్యాత్మక ప్రాంతాలకు సిబ్బంది కనీసం కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలంలో వాగులు, వంకలు దాటుకుంటూ అక్కడి చేరుకోవడం వైద్య సిబ్బందికి కత్తిమీద సాములా మారింది.

# కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

## విజయనగరంలో సిపిఎం రాస్తారోకో




విజయనగరం,జూలై25(ఆర్ఎన్ఎ): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎటువంటి కేటాయింపులు చేయకుండా తీవ్ర అన్యాయం చేసిందని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద బ్జడెట్ కేటాయింపులను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, తెలుగు ఆడపడుచు అయిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలసీతారామన్ రాష్ట్రానికి కేటాయింపులు చేయకుండా అన్యాయం చేశారన్నారు. విభజన చట్టంలోని అంశాలను నెరవేరుస్తామని చెప్పడం తప్ప ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. పోలవరానికి నిధులు లేవు, ఉత్తరాంధ్ర సుజలస్రవంతికి నిధులు కేటాయింపు లేదు, రైల్వే జోన్ ప్రస్తావన లేదు, జిల్లాలో గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయింపు లేదు, అమరావతి నిర్మాణానికి ప్రకటించిన 15 వెల కోట్లు ప్రపంచ బ్యాంక్ అప్పుకింద చెప్పడం దుర్మార్గమన్నారు. ఎటువంటి నిధులు కేటాయించకుండా కేంద్రం బ్జడెట్ పెడితే రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు చేయకుండా కేటాయిస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మరోసారి బిజెపి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వం విధానాన్ని రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తగిన నిధులు కేటాయింపులు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో సిపిఎం నాయకులు ఏ.జగన్మోహన్, పి.రమణమ్మ, బి.రమణ, యు ఎస్ రవికుమార్, సి హెచ్ వెంకటేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కూల్ పిల్లలు స్కూల్ కి వెళ్ళని పరిస్థితి

## గెడ్డలోనే గిరిజనులతో కలసి నిరసన

అల్లూరి,జూలై25: అల్లూరి జిల్లా దేవరాపల్లి, వాలాబు పంచాయతీ చివారు బోర్రచింత గిరిజనులు జల దిగ్బందనంలో చిక్కున్నారని సిపిఎం మండల కార్యదర్శి బిటి దోర పేర్కోన్నారు. గురువారం అతికష్టం మీద గ్రామాన్ని సందర్శించారు. అనంతరం గిరిజనులతో కలిసి పారుతున్న గెడ్డలో నిరసన తెలిపారు. అనంతరం అయిన మాట్లాడారు. గతవారం రోజులు నుండి కురుస్తున్న వర్షాలకు బోడ్డ గుమ్మి గెడ్డ ఉదృతంగా రావడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జలద్రిగ్బందంలో చిక్కుకోని నిత్యావసర వస్తువులు, విద్యా, వైద్యం అందక ముసలివారు, చిన్న పిల్లలు తీవ్ర అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పూర్వకాలం నుండి గిరిజనులు పాలకులకు మోరపెట్టుకున్న పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనులు పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దీంతో గిరిజనుల అభివృద్ధికి ఆమాడ దూరంలో ఉన్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కనిపిస్తున్న పార్టీల నాయకులు , గిరిజనులు కష్టాల్లో ఉన్నప్పుడు ఎందుకు కనిపించడం లెదన్నారు.


# జగన్.... డామిట్ కథ అడ్డం తిరిగిందా...

విజయవాడ, జూలై 25, (న్యూస్ పల్స్) జగన్ అనుకున్నది సాధించారా? లేక కథ అడ్డం తిరిగిందా? చేజేతులా బిజెపితో వైరం పెట్టుకున్నారా? ఇండియా కూటమికి దగ్గరై తప్పు చేశారా? పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హత్యా రాజకీయాలు పెరిగాయని జగన్ ఆరోపిస్తున్నారు. విధ్వంసకర ఘటనలు జరిగాయని చెప్పుకొస్తున్నారు. ఏపీలో జరుగుతున్న అరాచకాలపై ఢిల్లీ వేదికగా గళం ఎత్తాలని నిర్ణయించుకున్నారు. తన పోరాటానికి మద్దతు తెలపాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. కానీ కీలకమైన వామపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ ముందుకు రాలేదు. కానీ అనూహ్యంగా సమాజ్ వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆ పార్టీ ఎంపీ రాంగోపాల్ యాదవ్, శివసేన యుబిటి ఎంపీలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హక్, ఐయూఎమ్ఎల్ ప్రతినిధులు అబ్దుల్ వాహబ్, హ్యారీష్, ఏఐఏడిఎంకె ఎంపీ చంద్రశేఖర్ మద్దతు ప్రకటించారు. ఇలా జాతీయ పార్టీల అనూహ్య మద్దతును ఆహ్వానించాలో.. సంతోషించాలో జగన్కు తెలియని పరిస్థితి. జగన్ కు మద్దతు తెలిపిన పార్టీలన్నీ ఇండియా కూటమిలోనివే. పైగా బీజేపీకి బద్ధ శత్రువులు. ఈ పరిణామంతో బిజెపితో ఉన్న చిన్నపాటి అనుబంధం తెగిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా బిజెపితో వైసిపి అనుబంధం కొనసాగించింది. ఇప్పుడు ఏపీలో తన బద్ధ శత్రువులుగా ఉన్న చంద్రబాబు, పవన్ లు ఎన్డీఏ లో ఉన్నా.. బిజెపితో మాత్రం శత్రుత్వం పెంచుకోకూడదని జగన్ భావించారు. కానీ ఈ ధర్నా పుణ్యమా అని బిజెపి వ్యతిరేకుల సాయాన్ని తీసుకోవాల్సి వచ్చింది. అది కచ్చితంగా కేంద్ర పెద్దలకు ఆగ్రహానికి గురిచేసే అంశమే.దేశంలో మిగతా ప్రాంతీయ పార్టీలది ఒక ఎత్తు. వైసీపీ ది మరో ఎత్తు. అవినీతి కేసులను ఎదుర్కొన్న జగన్ ప్రాంతీయ పార్టీ పెట్టి సక్సెస్ అయ్యారు. ఇప్పటికీ ఆ కేసులు కొనసాగుతూనే ఉన్నాయి. పైగా బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసు సైతం వెంటాడుతోంది. గత ఐదేళ్ల వైసిపి పాలనలో వైఫల్యాలను కూటమి సర్కార్ బయటకు తీసే ప్రయత్నం చేస్తోంది. అక్రమాస్తుల కేసులు సైతం తెరపైకి వస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి అవసరం జగన్ కు ఉంది. అది తెలిసే ఎన్డీఏ ప్రభుత్వం విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. స్పీకర్ ఎంపిక విషయంలో బిజెపి విన్నపాన్ని మన్నించారు. మద్దతు కూడా ప్రకటించారు.అయితే జగన్ కఠిన నిర్ణయానికి వచ్చినట్లు పరిస్థితులు తెలియజేస్తున్నాయి. గత కొద్దిరోజులుగా లోక్ సభ డిప్యూటీ స్పీకర్ విషయంలో అధికార విపక్షాల మధ్య వాదోపవాదనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు విడిచిపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. కానీ 2019 ఎన్నికల్లో మాత్రం బిజెపి డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షాలకు కేటాయించలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. దీంతో విపక్షాల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి డిప్యూటీ స్పీకర్ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేశారు. విపక్షాలకు ఆ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఇండియా కూటమి వైపు తాము వెళుతున్నట్లు స్పష్టమైన సంకేతాలు ఇవ్వగలిగారు. అటు ఇండియా కూటమి నుంచి పెద్ద ఎత్తున నేతలు వచ్చి ధర్నాకు సంఘీభావం తెలపడం, విజయసాయిరెడ్డి ప్రకటనతో కొంతవరకు క్లారిటీ వచ్చింది.ఏపీలో టీడీపీ కూటమితో బిజెపి వెళ్తోంది. ఎన్డీఏలో టిడిపి తో పాటు జనసేన ఉంది. ఎన్డీఏ సుస్థిరతకు టిడిపి అవసరం ఉంది. పైగా రాజకీయంగా చంద్రబాబుకు సహకారం అందుతోంది. అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టునకు అండగా నిలవాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆపై కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. ఏపీ విషయంలో కేంద్రం ప్రత్యేక శ్రద్ధతో ఉంది. దీంతో జగన్ కు తత్వం బోధపడింది. బిజెపి టిడిపి తో వెళ్లడానికి స్ట్రాంగ్ గా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# సామాజిక కోణంలోనే విప్ ల భర్తీ

విజయవాడ, జూలై 25 ఏపీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. పాలనలో తన మార్కు చూపిస్తోంది.మరోవైపు సంక్షేమ పథకాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పింఛన్లను పెంచి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణం పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కేంద్రం సైతం బడ్జెట్లో 15 వేల కోట్ల రూపాయలు కేటాయించింది.మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు సైతంతమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఇప్పటికే 50 రోజుల పాలన సమీపిస్తుంది. చంద్రబాబు చాలా రకాల నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే విప్పులను కూడా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చీఫ్ విప్ తో పాటు ఏడుగురు విప్ లను నియమించాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. ఈరోజు దీనిపై అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. జనసేన పార్టీ తరఫున ఒక బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు విప్ పదవి ఇవ్వాలని చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఏపీలో మూడు పార్టీలు కలిపి కూటమి కట్టాయి. ఏకపక్ష విజయాన్ని సొంతం చేసుకున్నాయి. సుదీర్ఘకాలం ఈ పొత్తు కొనసాగాలని మూడు పార్టీలు కోరుకుంటున్నాయి. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయినందున.. నామినేటెడ్ పదవులతో పాటు ఇతర అంశాల్లో మూడు పార్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. అందులో భాగంగా చీఫ్ విప్ తో పాటు ఏడుగురు విప్ లను.. మూడు పార్టీల నుంచి ఎంపిక చేయనున్నట్లు సమాచారం. బిజెపి కి సంబంధించి విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును విప్ గా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టిడిపి నుంచి కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు, ఒక బీసీ, ఒక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించినట్లు సమాచారం. ప్రభుత్వ చీఫ్ విప్ ప్రకటన కూడా ఈరోజు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి. చీఫ్ విప్ రేసులో టిడిపి నేతలు బీటీ నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, జీవి ఆంజనేయుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి ఛాన్స్ దక్కొచ్చని తెలుస్తోంది. అయితే జనసేనతో పాటు బిజెపి సైతం చీఫ్ విప్ పదవి కోరుతున్నా.. టిడిపి మాత్రం విడిచి పెట్టే ఛాన్స్ కనిపించడం లేదు.శాసనమండలి నుంచి చీఫ్ విప్ ను ఎంపిక చేస్తే.. బీటీ నాయుడు పేరు ప్రతిపాదనలోకి తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం బీటీ నాయుడు కర్నూలు టిడిపి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ధూళిపాళ్ల నరేంద్ర మంత్రి పదవి ఆశించారు. పొన్నూరు నుంచి టిడిపి ఎమ్మెల్యేగా ఆరోసారి గెలిచారు. 1994లో తొలిసారిగా పోటీ చేసి గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటినుంచి 2014 వరకు వరుసగా ఐదు సార్లు గెలుస్తూ వచ్చారు. 2019లో మాత్రం కిలారి వెంకట రోశయ్య చేతిలో ఓడిపోయారు. ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణ పై 32 వేల మెజారిటీతో గెలిచారు. మంత్రి పదవి ఆశించారు. కానీ వివిధ సమీకరణల నేపథ్యంలో ఆయనకు పదవి దక్కలేదుటిడిపి సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సైతం చీఫ్ విప్ పదవి ఆశిస్తున్నారు. వినుకొండ నుంచి టిడిపి తరఫున ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2009లో టిడిపి తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. 2014 లోను విజయం సాధించారు. 2019లో మాత్రం ఓడిపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే మంత్రి పదవి ఆశించిన ఆంజనేయులకు ఛాన్స్ దక్కలేదు. కనీసం చీఫ్ విప్ పదవి ఇవ్వాలని ఆయన పార్టీ నాయకత్వాన్ని కోరినట్లు సమాచారం. ఈ ముగ్గురిలోఒకరికి పదవి ఖాయమన్నట్లు ప్రచారం జరుగుతోందిప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపిస్తూ జగన్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్నారు. మరోవైపు కీలక బిల్లులు శాసనసభలో ఆమోదం పొందుతున్నాయి. ఈ తరుణంలో చీఫ్ వీప్ తో పాటు ఏడు విప్ పదవులను భర్తీ చేయనున్నారు. అయితే ఓటమి అభ్యర్థులు 164 మంది ఎన్నికైన నేపథ్యంలో పదవులకు విపరీతంగా పోటీ ఉంది. మరి చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారో చూడాలి

# చందమామపై నీటి జాడలు




బీజింగ్, జూలై 25, (న్యూస్ పల్స్) చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. అంటూ చిన్నప్పుడు చందమామను చూపిస్తూ పిల్లలకు తల్లులు అన్నం తినిపించే దృశ్యాలు ఇప్పటికీ గ్రామాల్లో మననకు కనిపిస్తుంటాయి. అయితే ఆ చందమామ రాదని పిల్లలకు తెలియదు. తల్లులకు తెలుసు. కానీ, పిల్లలను ముద్దు చేస్తూ.. పిల్లలు చంద్రున్ని పిలుస్తుంటారు. ఇన్నాళ్లూ అందదు అని భావించిన చందమామ అందే రోజులు అతిత్వరలోనే రానున్నాయంటున్నారు పరివోధకులు. ఈ మేరకు ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి. ఇటీవలే భారత్ చంద్రయాన్ ?3 లో భాగంగా రాకెట్‌ను చంద్రుడిపైకి పంపించింది. రెండు చంద్రయాన్?1, చంద్రయాన్ ?2 విఫలమైనా.. చంద్రయాన్ ? 3తో భారత్ కూడా ప్రపంచంలో ఇప్పటి వరకు చంద్రుడిపైకి వెళ్లేందుకు ఇతర దేశాలు చేసిన ఖర్చుకన్నా తక్కువ ఖర్చుతో శాటిలైటను భారత్ చంద్రుడిపైకి పంపింది. ఈ శాటిలైట్ సూర్యుడి శక్తి ఆధారంగా పనిచేసింది. చంద్రుడిపై విజయవంతంగా ల్యాండ్ అయిన ఉప గ్రహం సుమారు ఐదు రోజులపాటు అక్కడి దృశ్యాలను కిందకు పంపించింది. తర్వాత చీకటి రావడంతో పనిచేయడం మానేసింది. ఇక ఇదే సమయంలో రష్యా కూడా ఉప గ్రహాన్ని చంద్రుడిపైకి పంపించింది. కానీ, అది విజయవంతం కాలేదు. ఆ తర్వాత చైనా కూడా చంద్రుడి అవతలివైపు ఉపగ్రహానిన విజయవంతంగా లాంచ్ చేసింది. చాంగే ? 5 సాయంతో జాబిల్లి నుంచి భూమికి మట్టిని తీసుకువచ్చిన చైనా.. నాలుగేళ్లుగా పరిశోధనలు చేస్తోంది. ఈ క్రమంతో ఈ పరిశోధనల ఫలితాల ఆధారంగా చంద్రునిపై నీరు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ విషయాన్ని చైనీస్ అకాడమ ఆఫ్ సైన్సెస్ వెల్లడించింది.చంద్రుడిపై మట్టి నమూనాల సేకరణ నలక్ష్యంగా చైనా 2020లో చేపట్టిన చాంగే ? 5 ప్రయోగం విజయవంతమైంది. చంద్రుడి ఉపరితలం నుంచి దాదాపు 2 కిలోల మట్టి, రాళ్ల నమూనాలను భూమిపైకి తీసుకువచ్చింది.అనంతరం వాటిపై బీజింగ్‌లోని నేషనల్ లేబొరేటరీ ఫర్ కండెన్స్‌డ్ మ్యాటర్ ఫిజిక్స్, సీఏఎస్‌కు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ పరిశోధకులు అధ్యయనం చేస్తున్నారు. ఆ నామూనాల్లో విస్తృత స్థాయిలో నీటి అణువులు ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు సీఏఎస్ ఇటీవల పేర్కొంది. ఇందుఉ సంబంధించిన పరిశోధన పత్రాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించినట్లు పేర్కొంది.ఇదిలా ఉండగా జాబిల్లిపై పరిశోధనలో భాగంగా అమెరికాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు 40 ఏళ్ల క్రితమే చంద్రునిపైకి వెళ్లి మట్టి నమూనాలు సేకరించారు. అనంతరం సోవియట్ యూనియన్ కూడా 1976లో చంద్రుడిపై మట్టి నమూనాలను భూమికి తీసుకువచ్చింది. ఈ రెండు దేశాల తర్వాత జాబిల్లి నుంచి మట్టిని సేకరించిన మూడో దేశం చైనా.. అయితే 2009లో భారత్ ప్రయోగించిన చంద్రయాన్?1 వ్యోమనౌక చంద్రుడిపై నీటిజాడ ఉన్నట్లు గుర్తించింది. అయితే దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదు. దీంతో భారత వాదనను ఎవరూ విశ్వసించలేదు. కానీ, భారత వాదననే ఇన్నేల్లకు నిజమైంది. భారత వాదనే నిజమని చైనా ధ్రువీకరించింది.

# ఏలూరు లో నకిలీ రిపోర్టర్ల హల్ చల్

ఏలూరు,ఏలూరు లో ఏలూరులో నకిలీ రిపోర్టర్ల అరెస్టు కలకలం రేపింది. వీరిలో ఇద్దరు మహిళా రిపోర్టర్లు వుండడం విశేషం. ఈ ముఠా దందాలు ఎంతో కాలంగా నడుస్తున్నా ఇప్పుడు వెలుగులోకి వచ్చాయి. ముఠా లో కీలక వ్యక్తి ఒక రౌడీ షీటర్. పోలీసులు మాట్లాడుతూ ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులమని అంటూ.. బెదిరించిన 4 గురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసామని వెల్లడించారు. ఏలూరు నగరపాలక సంస్థ 19వ డివిజన్ కొత్తూరు ఇందిరమ్మ కాలనీ చెందిన మండల అప్పలనాయుడు మంగళవారం నాడు ఏలూరు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో డొంక కదిలింది. ఏలూరు మండలం కొత్తూరు సుందర కాలనీ మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న అప్పలనాయుడు కర్రీ పాయింట్ నిర్వహిస్తున్న మండల అప్పల నాయుడు పై ముద్దాయిలు ఫుడ్ ఇన్స్పెక్టర్లమని కూరలలో కెమికల్స్ ఉన్నాయని, మీ షాపుకు లైసెన్స్ లేదని బెదిరించి కర్రీ పాయింట్ వ్యాపారస్తుడు నుండి పదివేల రూపాయలు డబ్బులు తీసుకున్నారని రాబడిన ఫిర్యాదు పై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఏలూరు ాాఆఖూ ఇ. శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఏలూరు వన్ టౌన్ సీఐ రాజశేఖర్ పర్యవేక్షణలో ఎస్ ఐ కే రాజారెడ్డి వారి సిబ్బంది ఒక టీం గా ఏర్పడి బుధవారం నాడు ఆశ్రమం జంక్షన్ వద్ద 4 ముద్దాయిలు మోటార్ సైకిళ్లపై పరార్ అవుతుండగా అరెస్ట్ చేయడం జరిగిందని, వీరు దగ్గర నుండి రెండు మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ మీడియాకు వివరించారు. నిందితులు ఘంటసాల దుర్గ (32). బుక్కూరి దేవి ప్రసాద్ (29). అగ్గాల ఉమామహేశ్వరి (28). పులిగా రాంబాబు (38).

# రాష్ట్రానికి చేరుకున్న వైఎస్ జగన్, వైకాపా నేతలు

గన్నవరం మాజీ సీఎం,వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఢిల్లీ నుండి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు.వారికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ మాట్లాడుతూ ఏపీలో టీడీపీ ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత రాజకీయాలను అరికట్టడానికి ఢిల్లీ వేదికగా జగనన్న సారథ్యంలో ధర్నా నిర్వహించాం. దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఏపీలో టీడీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఫొటోలతో డిస్ప్లే చేసి నిరసన తెలియజేసాం. అఖిలేష్ యాదవ్ తోపాటు మరికొన్ని పార్టీలు మాకు మద్దతు తెలిపాయి. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు దుర్మార్గపు పాలన ఎలా ఉందో ప్రజలంతా అర్థం చేసుకోవాలని అన్నారు.త్వరలో దేశ ప్రధానమంత్రిని కలిసి పరిస్థితి వివరిస్తామని అన్నారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు కాకుండానే ఇన్ని అరాచకాలు జరిగాయి. ఏపీలో రాష్ట్రపతి పాలన అవసరమని ఢిల్లీలో నిరసన తెలిపితే అనేక పార్టీలు సంఘీభావం తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజలను చంద్రబాబు భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమం విజయవంతం అయిందని అన్నారు.

# తిరుపతిలో ఘోరం

తిరుపతి, జూలై 25 తిరుపతిలో దారుణం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి ముగ్గురిని హత్య చేసి, ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. తిరుపతిలో బుధవారం రాత్రి ఈ దారుణం జరిగింది. పద్మావతి వర్సిటీ సమీపంలోని పద్మావతి నగర్‌లో ఓ వ్యక్తి ముగ్గురిని చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. వదినను హత్య చేసిన నిందితుడు ఆపై ఆమె ఇద్దరు పిల్లలను హతమార్చాడు. అనంతరం నిందితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాల కారణంగా నిందితుడు దారుణానికి పాల్పడి ఉండొచ్చునని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి

చేరుకుని పరిశీలిస్తున్నారు. క్లూస్ టీమ్ సిబ్బంది హత్యలు జరిగిన చోట ఆధారాలు సేకరిస్తున్నారు. తిరుపతి పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిలోని మునిరెడ్డినగర్ లో విషాదం చోటుచేసుకుంది. వదిన సునీత, పిల్లలు దేవీశ్రీ, నీరజలను మరిది మోహన్ కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఆపై నిందితుడు మోహన్ సూసైడ్ చేసుకున్నాడు. వదినతో పాటు ఇద్దరు పిల్లలను హత్య చేసిన వ్యక్తి ఆపై ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది. హత్యలు, ఆత్మహత్య ఘటనపై ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.నిందితుడు మోహన్ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చెందిన కేవీఎస్ లో పని చేస్తున్నాడని సమాచారం. ఇష్టం లేని పెళ్లి చేయడం వల్ల మోహన్ భార్య నుంచి విడాకులు తీసుకుని ఒంటరిగా ఉంటున్నాడు. మరోవైపు అన్న కుటుంబంతో ఆస్తి తగాదాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. ఆస్తి గురించి గొడవకు దిగి, మాటా మాటా పెరిగి అన్న భార్యను, వారి ఇద్దరు కుమార్తెలను నిందితుడు మోహన్ హత్య చేసి ఉంటాడని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వదిన, అన్న కూతుర్లను హతమార్చిన తమ్ముడు

## ఆపై ఆత్మహత్య

తిరుపతి,తిరుపతి పద్మావతి నగర్ లో విషాదం జరిగింది. అన్న పిల్లలు దేవిశ్రీ, నీరజ లతో పాటు అన్న భార్య వదిన సునీత ను హత్య చేసిని గుడిమెట్ల మోహన్ అని ఒక సాఫ్టువేర్ ఇంజనీర్ ఆపైన ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించిన జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సమగ్ర దర్యాప్తు కు ఆదేశించారు. కుటుంబ కలహాలతో తమ్ముడు అన్న భార్య, పిల్లలను హతమార్చాడు. హత్యలు జరిగిన సమయంలో ఇంటిలో ఎవరెవరు ఉన్నారు.. అనేదానిపై పూర్తి వివరాలు సేకరించాలని అధికారులకు ఎస్పీ ఆదేశించారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో కొన్ని కీలక ఆధారాలను సేకరించింది. సొంత మరిదే వదినను, అన్న పిల్లలను హత్య చేసేందుకు గల కారణాల గురించి వివిధ కోణాలలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు

# మహానంది అరటికి దేశవ్యాప్త గుర్తింపుకు తీసుకవస్తాం

## చెంచుగూడెంలో సమస్యలను పరిష్కరిస్తాం
## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



శ్రీ ప్రస్థానం - నంద్యాల/మహానంది, జులై 25:-మహానంది మండలంలో సాగుచేసే సుగంధం అరటికి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. గురువారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో బనానా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని సందర్శించి అరటి ఉత్పత్తి దారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ మహానంది సుగంధ అరటికి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకవచ్చి జియో ట్యాగింగ్ కోసం ప్రయత్నిస్తామన్నారు. అరటి రైతులు తమ అనుభవాలకు తోడు ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించుకోవాలని కోరారు. పండించిన అరటి పంటలకు ఏపీ ఎక్స్‌పోర్ట్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా మార్కెటింగ్ కు కృషి చేయాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న అరటి పంటలకు వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ వచ్చేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. రైతులు కోరిన 2 లక్షల వరకు పంట రుణాల పరిమితిని పెంచేందుకు కృషి చేస్తామన్నారు.అల్లీనగరం గ్రామంలో అరటి తోటలను, బుక్కాపురం పంచాయతీ శ్రీనగర్‌లో పసుపు పంటను కూడా కలెక్టర్ సందర్శించి సాగు ఖర్చులు, పంట సాగు విధానాలను రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన క్షేత్రస్థాయి అధికారులు రైతులకు అందుబాటులో ఉండి ఆధునిక పద్ధతులను తెలియజేయడంతో పాటు పంట దిగుబడి నాణ్యత పెంచేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం మహానందిలోని చెంచులక్ష్మి గూడెం వద్దకు చేరుకొని మామిడితోట చేపట్టిన గిరిజన రైతులతో ముచ్చటిస్తూ... మామిడి తోటలోని అంతర్గత పంటలను ఆదాయం వచ్చేలా వేసుకోవాలన్నారు. మీ పిల్లలు ఏమి చదువుతున్నారు, ఎలా ఉన్నారు అంటూ వివరాలు అడిగారు. పాఠశాలల్లో ఫీజులు అడుగుతున్నారని గిరిజన మహిళలు తెలుపగా తాను మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెంచుగూడెంలో ఆర్ఓఎఫ్ఆర్ కింద మిగిలిన రైతులకు పట్టాల పంపిణీకి, విద్యుత్ కనెక్షన్ కు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ గిరిజనులతో



అన్నారు. ఎన్ఆర్ఇజిఎస్ కింద డ్వామా ఏర్పాటు చేసిన ఫారం పాండ్‌లను కలెక్టర్ పరిశీలిస్తూ రెండు ఎకరాలకు ఒక్కొక్క ఫారం ఫండ్ త్రవ్వుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీడిని కలెక్టర్ ఆదేశించారు. చెంచుగూడెంలో పొలం గట్టు చుట్టూ ఇచ్చిన కొబ్బరి మొక్కలను సంరక్షించి పెంచాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# సాగునీటి సలహా మండలి సమావేశం వెంటనే జరపాలి.

## పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీళ్ల విడుదల చేయాలి.
## ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్..

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-గత కొన్ని వారాల నుంచి ఎగువన కురుస్తున్న భారీ వర్షాల వలన కృష్ణా, తుంగభద్ర నదులకు వస్తున్న వరద ప్రవాహం వల్ల శ్రీశైలం డ్యాం నీటిమట్టం 854 అడుగులకు చేరినందువల్ల మన జిల్లా త్రాగునీరు, సాగునీరు అవసరాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే సాగునీటి సలహా మండలి సమావేశం ఏర్పాటు చేయాలి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సాగునీరు విడుదలకు తీర్మానం చేసి వెంటనే నీళ్ల వదలాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలోని తెలుగు గంగ, ఎస్ ఆర్ బి సి, కేసీ కెనాల్, హంద్రీనీవా, కాల్వలకు నీళు వదిలి జిల్లాలోని రిజర్వాయర్లు మరియు చెరువులను నింపాలి. మన జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందించేందుకు వెంటనే ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

# పింఛన్...ఎప్పుడు వచ్చెన్.!

## ఆరు నెలలుగా మంజూరు కాని కొత్త పింఛన్ల దరఖాస్తుల అప్‌లోడింగ్‌కూ అవకాశం లేని పరిస్థితి



శ్రీ ప్రస్థానం-గడివేముల :- జులై 26 :- ఫిబ్రవరి నుంచి నిలిచిన కొత్త దరఖాస్తుల స్వీకరణ వేలాది మంది ఎదురుచూపులుకూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి ఈనెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచి ఇవ్వడంతో పాటు మూడు నెలల బకాయిలనూ అందించింది. ప్రతి నెలా ఇంటికే పింఛన్లు ఇస్తామని? మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్ని పనులు ఉన్నా పంపిణీ రోజున కచ్చితంగా పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఓ సమావేశంలో ప్రజాప్రతినిధులకు సైతం సూచించారు. పింఛన్ల అందజేతకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, కొత్తవి మంజూరు చేసే విషయంలో మాత్రం దృష్టిసారించడం లేదు. గత ప్రభుత్వం ఐడి లాగిన్ ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి నుంచి కొత్త దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అర్హులైన వేలాది మంది పింఛన్లకు నోచుకోలేకపోతున్నారు.టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీ మేరకు వృద్ధుల పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయిలు చెల్లించింది. వికలాంగులు, లెప్రసీ, కిడ్నీ, తలసేమియా తదితర వ్యాధిగ్రస్తులకు పింఛన్ సొమ్మును రెండింతలు చేసి జూలైలో అందించింది. దీంతో జూన్‌లో రూ.93.30 కోట్లు పంపిణీ చేయగా, జూలైలో అదనంగా రూ.118.39 కోట్లను అదనంగా ఇచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొత్త పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల పింఛన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

# దొరవారి సత్రం మండలంలోని రెవెన్యూ అధికారులు పని తీరు ఇకనైనా మారెనా?

## ప్రభుత్వ భూములను కాపాడే ప్రయత్నంలో విఫలమవుతున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలంలోని రెవెన్యూ అధికారులు తీరు ఎప్పటి లాగానే ఉంది. ప్రభుత్వాలు మారుతున్న వారు తీరు మాత్రం మారడం లేదు. మండలంలోని అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు భూకబ్జాలు జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం చూసి చుడన్నట్టు పట్టి పడనట్టు ఉంది వాళ్ళ తీరు. మండలంలోని అనేక గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న వాళ్లు మాత్రం ప్రభుత్వ భూమిని కాపాడడంలో విఫలమవుతున్నారు. అనేక గ్రామాల్లో చెరువులు, ఫారెస్ట్ భూములు వందల ఎకరాలు కబ్జాదారులు ఆక్రమించుకొని ఉన్నారు. గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా బోర్డులను ఉంచి వెళ్తున్నారు. భూకబ్జాదారులు మాత్రం అబోర్డులను తొలగించి యధావిధిగా సాగు చేసుకుంటూ ఉన్నారు. సాగుచేసిన వాళ్ల మీద ఎలాంటి చర్యలు మాత్రం ఈ మండలంలో ఇప్పటివరకు లేవు. ఇప్పటికే పత్రిక విలేకరులు పలుమార్లు ఈ భూకబ్జాలను తెలియజేస్తున్న రెవెన్యూ అధికారులకు మాత్రం చెవిటి వారి చెవిలో శంఖం ఊదినట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని రెవెన్యూ అధికారులు. ఇకనైనా మేలుకొని మండలంలోని ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటారని మండలంలోని ప్రజలు కోరుకుంటున్నారు.



# సింపతి కోసమే ప్రయత్నమా...

విజయవాడ, జూలై 25 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు హోదా యోధునిగా మారారు. తనకు ప్రతిపక్ష నేత హోదా కోసం యోధునిగా మారిన అన్ని వ్యతిరేకంగా ఉన్నప్పటికీ పోరాడుతున్నారు. మొదట తనకు ప్రతిపక్ష నేత హోదా కల్పిస్తారని ఆయన అనుకున్నారు. కానీ అలా చేయకపోవడంతో స్పీకర్‌కు లేఖ రాశారు. స్పీకర్ పట్టించుకోలేదు. మంగళవారం జరిగిన సభలో వైఎస్ఆర్‌సీపీ పక్ష నేతగానే జగన్ మోహన్ రెడ్డిని గుర్తిస్తూ ప్రకటన చేశారు. దీంతో జగన్ వెంటనే హైకోర్టులో పిటిషన్ వేశారు. తనను ప్రతిపక్ష నేతగా గుర్తించేలా స్పీకర్ ను ఆదేశించాలని ఆయన పిటిషన్‌లో కోరారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు ప్రతిపక్ష నేత హోదా కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని తెలియగానే చాలా మంది ఆశ్చర్యపోయారు. ఎందుకంటే శాసన వ్యవస్థను న్యాయవ్యవస్థ ఆదేశించలేదు. ముఖ్యంగా శాసనసభా వ్యవహారాల్లో స్పీకర్ పాత్రే అత్యున్నతం. స్పీకర్ సభా నిర్వహణ విషయంలో ఫలానా పని చేయాలని న్యాయవ్యవస్థ ఆదేశించలేదు. అందుకే ఇలాంటి అంశాల్లో దాఖలైన పిటిషన్లకు సంబంధించి కోర్టులు సూచనలు మాత్రమే చేస్తాయి. వాటిని అమలు చేస్తారా లేదా అన్నది స్పీకర్ ఇష్టం. అయితే ఇలాంటి సూచనలు ..ఫిరాయింపు నిరోధక చట్టం విషయంలో దాఖలైన పిటిషన్లపైనే ఇప్పటి వరకూ కోర్టులు చేశాయి. ఫలానా నేతను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని ఎప్పుడూ కోర్టులు సూచనలు కూడా చేయలేదు. ఈ విషయం జగన్‌కు తెలియనిదేం కాదు.. ఆయనకు తెలియకపోయినా ఆయన సలహాదారులకు తెలిసే ఉంటుంది. ఖచ్చితంగా కోర్టులో ఎదురుదెబ్బ తగులుతుందని తెలిసి కూడా జగన్ పిటిషన్ వేశారని ఎవరికైనా సులువుగా అర్థమవుతుంది. వైసీపీకి పదకొండు సీట్లు మాత్రమే రావడంతో ప్రధాన ప్రతిపక్ష నేత అర్హత కూడా సాధించలేకపోయింది. పది శాతం సీట్లు సాధిస్తేనే.. ప్రతిపక్ష నేత హోదా వస్తుందని ఇప్పటి వరకూ అనేక సార్లు రుజువు అయింది. పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్టీకి రెండు సార్లుగా ప్రధాన ప్రతిపక్ష హోదా లేకపోవడం .. సుప్రీంకోర్టుకు వెళ్లినా సానుకూల ఫలితం రాకపోవడంతో సైలెంట్ అయిపోయారు. అయితే ఇక్కడ ఓ చాయిస్ ఉంది. అది స్పీకర్ చేతుల్లో ఉంది. ప్రతిపక్ష హోదా వైఎస్సార్‌సీపీకి ఇవ్వాలనుకుకంటే స్పీకర్ ఇవ్వొచ్చు. చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం అధికార పక్షానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షం ఎన్ని సీట్లు గెలిచినా సీట్ల సంఖ్యతో సంబంధం లేకుండా ఇవ్వొచ్చు. ఏపీ అసెంబ్లీలో ప్రతిపక్షం ఒక్క వైసీపీనే. స్పీకర్ అనుకుంటే ఇస్తారు. కానీ జగన్‌కు అలాంటి అవకాశం ఇవ్వకూడదని..ఆయనకు

ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని టీడీపీ గట్టిగా అనుకుంటోంది. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి రాజకీయ ప్రత్యర్థులు, వ్యక్తిగత శత్రువులు వేర్వేరు కాదు. తన రాజకీయ ప్రత్యర్థుల్ని ఆయన వ్యక్తిగత శత్రువులుగానే చూస్తారు. గత ఐదేళ్ల కాలంలో టీడీపీ నేతలు పడిన ఇబ్బందులు.. అసెంబ్లీలో వారు ఎదుర్కొన్న అవమానాలు మరే సభలోనూ విపక్ష సభ్యులు ఎదుర్కొని ఉండరు. చివరికి చంద్రబాబునాయుడు కంటతడి పెట్టుకోవాల్సి వచ్చింది. ఇలాంటి సమయంలో ఆయనకు ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష నేత హోదా ను కల్పిస్తే.. అంత కంటే తప్పిదం ఉండదని అనుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఆయన వైసీపీ ఫ్లోర్ లీడర్ గా ఉంటారు. పార్టీ బలం ప్రకారం మాట్లాడే అవకాశం వస్తుంది. కానీ ప్రతిపక్ష నేత హోదా మాత్రం రాదు. కోర్టులకు వెళ్లినా రాదు.. ఇదంతా తెలిసి జగన్ పోరాటం చేస్తున్నారు. అన్నీ తెలిసీ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా కోసం పోరాటం చేయడం చాలా మందిని ఆశ్చర్య పరుస్తోంది.

# మైనార్టీల అభివృద్ధి లేని బడ్జెట్

## తాజా బడ్జెట్‌లో పలు మైనారిటీ పథకాలలో కోతలు
## మోడీ అనుసరించే మైనారిటీ వ్యతిరేక విధానాలు తాజా బడ్జెట్‌లో ప్రత్యక్షంగా కనపడుతున్నాయి.
## మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌కు గతేడాది రూ.96 కోట్ల ఇస్తే.. ఈ సారి రూ.45 కోట్లు కేటాయింపు.
## రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
## ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ డిమాండ్.

బద్వేలు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్లో మోడీ అనుసరించే మైనారిటీ వ్యతిరేక విధానాలు ప్రత్యక్షంగా కనపడుతున్నాయని మైనార్టీల బడ్జెట్ కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రాకపోవడం చేతకాని తనమేనని ఆయన అన్నారు. కేవలం రాజధాని నిధులు ఇచ్చారని సంకలు గుద్దుకోవడమే తప్ప రాష్ట్రంలో మైనార్టీ వర్గాలకు కేంద్ర బడ్జెట్లో అన్యాయం జరుగుతుంటే మైనార్టీ మంత్రి గాని సంబంధిత అధికారి గాని కేంద్ర బడ్జెట్ పై నోరు విప్పక పోవటం బాధాకరమన్నారు. మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీ వర్గాలకు బడ్జెట్‌లో ప్రధాన శాఖలోని పెద్ద ఎత్తున పోతుల విధించారని ఆయన అన్నారు. ముఖ్యంగా అనేక స్కాలర్‌షిప్‌లు, నైపుణ్యాభివృద్ధి పథకాలు నిధులలో కోత విధించారని,తాజా బడ్జెట్‌లో జరిగిన కేటాయింపులు మైనారిటీలు అధికంగా ఉండే దాదాపు 1,300 ప్రాంతాలలో అభివృద్ధి లోటును పూడ్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ప్రధాన్ మంత్రి జన్ వికాస్ కార్యక్రమ్ (పీఎంజేవీకే)కు జరిగిన కేటాయింపులేననితాజా బడ్జెట్‌లో ఈ శాఖకు కేటాయింపులు పెంచినట్లు ప్రభుత్వం చెప్పుకుంటుందని ఆయన అన్నారు,అది కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన పీఎంజేవీకేకు కేంద్రం బడ్జెట్‌లో రూ. 300 కోట్ల మేర సహాయం అందించినందున కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖకు జరిపిన కేటాయింపుల్లో స్వల్ప పెరుగుదలకు కారణమైందని వారు వివరించారు. కొత్త ఎన్డీఏ ప్రభుత్వ తొలి బడ్జెట్‌లో, కేంద్ర రంగ పథకాల కింద, కేవలం పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ మాత్రమే రూ.1,065 కోట్ల నుంచి రూ.1,145 కోట్లకు పెరిగింది. నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి పథకాలు గతేడాది మంజూరు చేసిన రూ.64.4 కోట్లతో పోలిస్తే కేవలం రూ.3 కోట్లకు తగ్గాయి. నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎన్ఎమ్ డీఎఫ్‌సీ)కి చివరిసారిగా రూ.61 కోట్లు మంజూరు చేయగా.. ఈ సారి ఎటువంటి మొత్తాన్నీ కేటాయిం చకపోవటం గమనార్హం. మొత్తం విద్యా సాధికారత రూ.1,689 కోట్ల నుంచి 1,575 కోట్లకు తగ్గింది. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం గతేడాది కేటాయించిన రూ.433 కోట్లతో పోలిస్తే రూ.326.2 కోట్లకు తగ్గింది. మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌కు గతేడాది రూ.96 కోట్ల ఇస్తే.. ఈ సారి రూ.45 కోట్లు కేటాయించారు. ఉచిత కోచింగ్, అనుబంధ పథకాలకు గతసారి కేటాయించిన రూ.30 కోట్లతో పోలిస్తే కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేంద్రం ఇచ్చింది. విదేశీ చదువుల కోసం విద్యా రుణాలపై వడ్డీ రాయితీని రూ.21 కోట్ల నుంచి రూ.15.3 కోట్లకు తగ్గించింది అని ఆయన వాపోయారు.2014లో మోడీ ప్రభుత్వ తొలి బడ్జెట్‌తో పోలిస్తే గతేడాది బడ్జెట్‌లో మంత్రిత్వ శాఖ కేటాయింపులు 17 శాతం తగ్గాయి. మైనారిటీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవటానికి తీసుకున్న విద్యా రుణాలపై వడ్డీ రాయితీలు మంజూరు చేసే పఢో పరదేశ్ పథకం రద్దు చేయబడిన కేంద్ర రంగ పథకాలలో ఒకటి. విద్యార్థులకు నెలకు రూ.1,000 వరకు అందించే ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ 1 నుండి 8 తరగతులకు రద్దు చేయబడింది అని ఆయన అన్నారు. కాగా, మోడీ ప్రభుత్వం ఎప్పటిలాగే తమ పట్ల వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నదని మైనారిటీ వర్గాలు ఎటు చూసినా అన్యాయమే చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు . కేంద్ర బడ్జెట్ పై రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల పక్కన నిలబడి పోరాటం చేసి కోత విధించిన బడ్జెట్ను పెంచే విధంగా చూడాలని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించినపీడీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ఎం. డీ రఫీ



నంద్యాల జూలై 25 నంద్యాల పట్టణంలో టెక్కీ మున్సిపల్ హై స్కూల్ లో నేడు పీడీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. ఎం .డీ రఫీ తన బృందం తో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు అయ్యిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కింద విద్యార్థులకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి మొదటి తరగతి నుంచి ఐదో తరగతి వరకు 5 రూపాయల 88 పైసలు కేటాయించింది ఆరు నుంచి పదవ తరగతి వరకు 8 రూపాయల 57 పైసలు కేటాయించింది దీనిపై దృష్టి ఉంచి ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు పది రూపాయలు 6 నుంచి 10వ తరగతి వరకు 15 రూపాయలు పెంచవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు నీటి సరఫరా లేక పరిశుభ్రపు లేని మంచినీళ్లను త్రాగుతూ ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క ప్రభుత్వ పాఠశాలలో ఆరో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి ఉన్నవాటిని మరమ్మత్తు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. గతంలో నాడు నేడు లో జరిగిన అవినీతి కుంభకోణాన్ని విచారణ చేసి అవినీతికి పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి బాలాజీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ షాహిద్ పట్టణ నాయకులు చందు ధను వీరేష్ తదితర నాయకులు పాల్గొన్నారు

## బలిజ సంఘం యువకుల ఆత్మీయ అభినందన సమావేశంలో పాల్గొన్న నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్

నంద్యాల జిల్లా 25నంద్యాల స్థానిక సంజీవనగర్ గేట్ నందుగల అశోక్ ఫ్యామిలీ రెస్టారెంట్ నందు బలిజ సంఘ యువకుల ఆత్మీయ సమావేశం బలిజ కాపు సేవాసమితి ప్రధాన కార్యదర్శి దండే వెంకట నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు పాల్గొన్నారుబలిజ సంఘం నాయకులు ఉయువకులు ఎన్ఎండి ఫిరోజ్ ఘనంగా స్వాగతం పలికారు. తెలుగు రచయిత మరియు కవి కొప్పుల ప్రసాద్ ఎన్ఎండి ఫిరోజ్ గారిని , రాష్ట్ర కార్యదర్శి రామచంద్ర రావు ను కవితతో స్వాగతం పలికారుఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ బలిజ సోదరుల సహాయం ఎప్పటికి మరువనిది అని తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్ఎండి ఫరూక్ ప్రకటించినప్పుడు మొదటిగా మా వెంట నిలబడి కష్టపడి పనిచేసింది బలిజ సంఘం నాయకులేనని గుర్తుచేసుకున్నారు. అంతేకాకుండా 2024 ఎన్నికల్లో ఎన్ఎండి ఫరూక్ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తని నాయకులను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఎన్నికల్లో ఎన్ఎండి ఫరూక్ ను, నన్ను తమ కుటుంబ సభ్యులుగా ఆదరించి మాకు దగ్గరుండి ఎన్నికల్లో సహాయ సహకారాలు అందించిన బలిజ సోదరుల కృషి ఎప్పటికి మర్చిపోలేమన్నారు. గతంలో శిల్పా కుటుంబం వారానికోసారి చుట్టాపూచూపుగా వచ్చి దళారులతో నంద్యాల దోచుకొని డబ్బుల మూటలు వెనకేసుకుంటూ నంద్యాలను 20 ఏళ్లుగా సర్వనాశనం చేశారన్నారు. ఎన్ఎండి ఫరూక్ నాయకత్వంలో నంద్యాలను తిరిగి అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని అందుకు మీ అందరి సహాయ సహకారం ఉండాలని బలిజ సంఘ యువతను కోరారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మర్చిపోకుండా గెలిచిన 10 రోజులకే వార్డు వార్డున తిరుగుతూ ప్రజల దగ్గర నుంచి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. నంద్యాల ప్రజలకు ఏ సమస్య వచ్చిన తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పరిష్కరిస్తానని తెలిపారు.ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేదుర్ల రామచంద్రరావు మాట్లాడుతూ యువత ముందుకు వచ్చి రాజకీయంగా అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రజలకు సేవ చేసేలా ముందుకు సాగాలని, ఎన్నికలలో కష్టపడి పని చేసిన బలిజ సంఘం యువతను ఈ సందర్భంగా ఆయన అభినందించడం జరిగింది.అనంతరం నిర్వాహకులు ఫిరోజ్ రామచంద్ర రావు ఘనంగా సన్మానించి మెమొంటోను బహుకరించడం జరిగిందిఈ కార్యక్రమంలో నిర్వాహకులు దండే దస్తగిరి , చింటూ , మల్లి కార్జున , బుజ్జి మరియు 500 మంది నంద్యాల బలిజ సంఘం యువత పాల్గొన్నారు



EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757